క్లుప్తంగా

పోలింగ్ కేంద్రాల పరిశీలన


పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

నల్లచెరువు: మండలంలోని తలమర్లవాండ్లపల్లి, కె.పూలకుంట, నల్లచెరువులోని పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ రవికుమార్, ఎంపీడీఓ రాణెమ్మ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఎంఈఓలు తిరుపాల్ నాయక్, చెన్నకేశవులు పాల్గొన్నారు.

జగన్ హయాంలోనే బీసీలకు అధికారం

కనగానపల్లి: వైఎస్ జగన్ హయాంలోనే బీసీ వర్గాలకు రాజ్యాధికారం దక్కిందని జెడ్పీటీసీ సభ్యుడు మారుతిప్రసాద్ తెలిపారు. బుధవారం ఆయన కనగానపల్లిలో వైఎస్సార్‌సీపీ బీసీ నేతలు, ప్రజాప్రతినిధులతో కలసి విలేకరులతో మాట్లాడారు. ఎన్నికలు సమీపిస్తున్న వేళ టీడీపీ నేతలు 'జయహో బీసీ' అంటూ గ్రామాల్లో ఉత్తుత్తి సభలు నిర్వహిస్తున్నారన్నారు. ఇందుకు రెండు రోజుల క్రితం కనగానపల్లిలో నిర్వహించిన సభే నిదర్శనమన్నారు. బీసీల సభలోనూ పరిటాల సునీత తన సామాజిక వర్గానికి చెందిన వారికే ప్రాధాన్యత ఇచ్చారన్నారు. ఇలాంటి వారు నియోజకవర్గంలో 80 శాతంపైగా రాజకీయ పదవులను బీసీలకే కట్టబెట్టిన ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గురించి లేనిపోని ఆరోపణలు చేయటం సిగ్గుచేటన్నారు. ఈ ప్రాంతంలో 25 ఏళ్ల పాటు రాజకీయ పదవుల్లో ఉన్న పరిటాల కుటుంబ సభ్యులు చేయలేని అభివృద్ధి పనులను ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి నాలుగున్నరేళ్లలో చేసి చూపించారన్నారు. బీసీ నేతలు నాగముని, ప్రభాకర్, ఆలమూరప్ప, అంకె అశోక్, చిన్నూరు రాము, బండి రవి, పోతలయ్య పాల్గొన్నారు.

విద్యార్థికి అభినందనలు


సాయిదివ్యతేజరెడ్డి

ఎన్‌పీ కుంట: అల్లుగుంటివారిపల్లి ప్రాథమిక పాఠశాలలో సెంకడరీగ్రేడ్ ఉపాధ్యాయుడు శ్రీనివాసులురెడ్డి కుమారుడు సాయిదివ్యతేజరెడ్డి జేఈఈ మెయిన్‌లో 275 మార్కులు సాధించి 99.97 పర్సంటైల్‌తో సత్తా చాటాడు. ఎంఈఓలు గోపాల్‌నాయక్, సుబ్బిరెడ్డితో పాటు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు హరిప్రసాద్ రెడ్డి సాయిదివ్యతేజరెడ్డిని అభినందించారు.

'జనసేనతో సంబంధం లేదు'


విలేకర్లతో మాట్లాడుతున్న పాటిల్ ఓబిరెడ్డి

బత్తలపల్లి: జనసేన ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదనరెడ్డి మండల కమిటీలో తనను ఉపాధ్యక్షులుగా నియమించారని, నిజానికి ఆ పార్టీతో తనకు ఎలాంటి సంబంధం లేదని వైఎస్సార్‌సీపీ నేత పాటిల్ ఓబిరెడ్డి ప్రకటించారు. ఆయన తన తండ్రి పాటిల్ నారాయణరెడ్డితో కలిసి బుధవారం బత్తలపల్లిలో జరిగిన ఆసరా వారోత్సవాల్లో ఎమ్మెల్యేను కలిశారు. అనంతరం ముష్టూరు సర్పంచు చెడిపోతుల గోపాల్, నాయకులు ముష్టూరు నరసింహారెడ్డి, గంగాధరరెడ్డితో కలిసి విలేకర్లతో మాట్లాడారు. తనకు చిలకం బంధువు కావడంతో రమ్మంటే ఇంటికి వెళ్లి కలిసినట్లు తెలిపారు. తర్వాత రోజు పత్రికల్లో తనను మండల ఉపాధ్యక్షుడిగా నియమించినట్లు ప్రకటించడంతో తన తండ్రితో కలిసి వివరణ ఇస్తున్నట్లు తెలిపారు. తాము వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతున్నట్లు ప్రకటించారు.

విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ

బత్తలపల్లి: డి.చెర్లోపల్లి ఎస్సీ కాలనీలో బుధవారం అంబేడ్కర్ విగ్రహ ఏర్పాటుకు అంబిక సేవా చారిటబుల్ ట్రస్ట్ అధినేత దంపెట్ల శివ భూమి పూజ నిర్వహించారు. అనంతరం విగ్రహ నిర్వహణపై కాలనీ పెద్దలతో పలు సూచనలు చేశారు. ఎస్సీ, ఎస్టీ ప్రజా సమాఖ్య అధ్యక్షుడు మద్దలచెరువు మల్లి, హ్యాండ్ బాల్ సెక్రటరీ శివశంకర్, స్థానికులు పాల్గొన్నారు.

రోడ్డు నిబంధనలపై అవగాహన అవసరం


వ్యాసరచన పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులతో అధికారులు, ఉపాధ్యాయులు

తాడిమర్రి: రోడ్డు నిబంధనలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంవీఐ వరప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ రహదారి మాసోత్సవాలు పురస్కరించుకుని బుధవారం ఆయన స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు రోడ్డు నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయులతో కలసి విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. ఏఎస్‌ఐ సూర్యనారాయణరాజు, ఎంఈఓ కృష్ణమోహన్, ఇన్‌చార్జి హెచ్‌ఎం మాధవీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జగనన్నతోనే మహిళా సాధికారత



పొదుపు సంఘాల మహిళలకు మెగా చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి, సమావేశానికి హాజరైన మహిళలు

- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి
- డ్వాక్రా మహిళలకు మెగా చెక్కు అందజేత

బత్తలపల్లి: జగనన్నతోనే మహిళా సాధికారత సాధ్యమని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ముందు వైఎస్సార్ ఆసరా వారోత్సవాలను ఎంపీపీ బగ్గిరి త్రివేణి అధ్యక్షతన నిర్వహించారు. పొదుపు సంఘాల మహిళలకు వైఎస్సార్ ఆసరా పథకం కింద మంజూరైన రూ.5,63,32,415 మెగా చెక్కు అందజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మహిళలు చేసిన నృత్యాలు అలరించాయి.

రూ.22.53 కోట్లు అందజేత

ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 870 సంఘాల్లో 6,513 మంది సభ్యులకు రుణమాఫీ కింద రూ.22.53 కోట్లు అందజేశారన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేనంతగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి జరిగిందన్నారు. జగనన్న సంక్షేమ పథకాలను పొరుగు రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుంటున్నాయన్నారు. జగనన్నకు అభిస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు విమర్శలు చేయడమే పనిగా పెట్టుకున్నాయని ఆరోపించారు. అవినీతిరహిత రాష్ట్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దుతున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99.99 శాతం నెరవేర్చిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. గతంలో మీ గ్రామాల్లో అభివృద్ధి ఎలా ఉంది. ఇప్పుడు ఎలా ఉందో బేరీజు వేసుకోవాలన్నారు. సంక్షేమ పథకాలను మీ ముంగిటకు తీసుకొచ్చేందుకు వలంటీర్లు, గ్రామ సచివాలయ వ్యవస్థను మీ గ్రామాలకే తీసుకొచ్చారన్నారు. కరోనా సమయంలో ప్రజల వద్దకు రావాలంటే భయపడుతున్న సమయంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు మీ ఇంటి వద్దకు వచ్చి మీకు సేవలు అందించారని గుర్తు చేశారు. అలాంటి సమయంలోనూ సంక్షేమ పథకాలను ఆపకుండా అందించిన ఘనత సీఎం జగనన్నకు దక్కుతుందన్నారు. కరోనా పరీక్షలకు ఇతర రాష్ట్రాలు డబ్బు వసూలు చేస్తే, మన రాష్ట్రంలో ఉచితంగా పరీక్షలు నిర్వహించారని వివరించారు. అప్పుడు టీడీపీ నాయకులు ఇళ్లలో నుంచి బయటకు కూడా రాలేదన్నారు. తాము మాత్రం ప్రజలకు అండగా నిలిచామన్నారు. వచ్చే ఎన్నికల్లో రెండు ఓట్లు ఫ్యాను గుర్తుకే వేయాలని అభ్యర్థించారు.

టీడీపీ నాయకులను నిలదీయండి..

జగనన్న ఇస్తున్న సంక్షేమ పథకాలతో శ్రీలంక, పాకిస్తాన్ అవుతుందంటూ ఆరోపణలు చేసిన టీడీపీ నాయకులను ప్రశ్నించాలని ఎమ్మెల్యే మహిళలకు సూచించారు. చంద్రబాబు మూడు సార్లు ముఖ్యమంత్రి అయ్యారు కదా ఏమి చేశారని చెప్పమని అడగాలన్నారు. టీడీపీ హయాంలో కేవలం ఐదారుగురు, జన్మభూమి కమిటీ సభ్యులు మాత్రమే బాగుపడ్డారన్నారు. పిట్టకథలతో టీడీపీ నాయకుల తీరును వివరించారు. గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామంటున్నారని, అంతకు ముందు 2014లో చెప్పావు కదా ఎందుకు ఇవ్వలేకపోయారని అడగాలన్నారు. వైకేపీ కోఆర్డినేటర్ రామేశ్వరరెడ్డి, ఏపీఎం సుదర్శన్‌రాజు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కమతం ఈశ్వరయ్య, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ ఈడిగ కాశప్ప, నాయకులు చల్లా క్రిష్టా, ముష్టూరు నరసింహారెడ్డి, ముసలయ్య, ప్రతాప్‌రెడ్డి, వెంకటేష్, ప్రసాద్‌రెడ్డి, నాగభూషణ, సాంబశివ, హనుమంతరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

అక్కచెల్లెమ్మలకు జగనన్న అండ


మహిళలనుద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

- ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి రూరల్: అనేక సంక్షేమ పథకాల ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అక్కచెల్లెమ్మలకు అండగా నిలుస్తున్నారని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి అన్నారు. పుట్టపర్తిలో బుధవారం వైఎస్సార్ ఆసరా వారోత్సవం నిర్వహించారు. పుట్టపర్తి, కొత్తచెరువు, బుక్కపట్నం మూడు మండలాలకు చెందిన వేలాదిమంది డ్వాక్రా మహిళలు హాజరయ్యారు. ఈసందర్భంగా 2,363 మహిళా సంఘాలకు చెందిన 23,311 సభ్యులకు రూ.18.52 కోట్ల మెగా చెక్కు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో మరే ఇతర రాష్ట్రంలోనూ లేనవిధంగా జగనన్న మహిళలకు చేయూతనిస్తున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి అడుగుజాడల్లో ఆయన తనయుడు వైఎస్ జగన్ మహిళా సాధికారత కోసం కృషి చేస్తున్నారన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం డ్వాక్రా రుణాలన్నీ మాఫీ చేశారన్నారు. నేటి తరంతోపాటు భవిష్యత్ తరాల తలరాతలు మారేలా పుట్టపర్తి అభివృద్ధి సాగుతోందని ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి అన్నారు. సత్యసాయి బాబా అవతరించిన పుట్టపర్తి సీఎం జగన్ ఆశీస్సులతో శ్రీసత్యసాయి జిల్లాగా మారిందన్నారు. శాశ్వత కరువు నివారణకు రూ.864 కోట్లతో 193 చెరువులు కృష్ణా జలాలతో నింపే ప్రాజెక్టు ఈ ప్రాంతానికి ఒక వరమన్నారు. పుట్టపర్తి మీదుగా జాతీయ రహదారులు సాధించగలిగామన్నారు.

బాబు, పవన్, పల్లెను నమ్మొద్దు

దగాకోరులు చంద్రబాబు, పవన్‌కల్యాణ్, పల్లె రఘునాథరెడ్డిని నమ్మొద్దని ఎమ్మెల్యే శ్రీధర్ రెడ్డి పిలుపునిచ్చారు. 2014 ఎన్నికల ముందు 600 హామీలు ఇచ్చి ప్రజలను నిలువునా మోసం చేశారన్నారు. తిరిగి అందరూ మూకుమ్మడిగా జతకట్టి మోసం చేసేందుకు వస్తున్నారన్నారు. అధికారం కోసం ప్రజలకు వారు చేసిన ద్రోహాన్ని మనన చేసుకొని, జగనన్న చేసిన మంచిని గుర్తించుకొని వచ్చే ఎన్నికల్లో ఫ్యాను గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ జెండా ఎగురవేయాలని కోరారు. అనంతరం మహిళలతో కలిసి సీఎం జగన్మోహన్ రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పుడా చైర్‌పర్సన్ లక్ష్మి నరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగ ఓబులపతి, జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు ఆవుటాల రమణారెడ్డి, వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు రంగారెడ్డి, జగన్మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, ఎంపీపీలు ఏవీ రమణారెడ్డి, శ్రీలత గోవర్ధన్ రెడ్డి, గాయత్రి, రెడ్డప్ప రెడ్డి, జెడ్పీటీసీలు లక్ష్మీనరసమ్మ, శ్రీధర్‌రెడ్డి గంగాదేవి, మున్సిపల్ ఉపాధ్యక్షులు తిప్పన్న, లక్ష్మీనారాయణరెడ్డి, కౌన్సిలర్లు సాయిగీత, ఈశ్వరమ్మ, సూర్య గౌడ్, భాస్కర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి సాయిలీలా, పట్టణాధ్యక్షురాలు కవిత, కన్యాకుమారి తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న మహిళలు

వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు


అర్బన్ పీహెచ్‌సీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

కదిరి టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వైద్యరంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఆయన మున్సిపాలిటి పరిధిలోని 13వార్డు పరిధిలోని బేరిపల్లి(నిజాంవలీ కాలనీ)లో నూతనంగ నిర్మించిన డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి సచివాలయం పరిధిలోని అర్బన్, విలేజ్ హెల్త్ సెంటర్లను అందుబాటులోకి తీసుకువచ్చారన్నారు. పట్టణంలో నాలుగు వైపులా 4 డాక్టర్ వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ కేంద్రాల్లో క్వాలిఫైడ్ డాక్టర్లను ఏర్పాటు చేసి అనేక జబ్బులకు చికిత్సలు చేయడంతో పాటు రక్త పరీక్షలను నిర్వహిస్తున్నమన్నారు. ప్రతి పేదవాడికి కార్పొరేట్ సాయి వైద్య సేవలు అందించాలని దృఢ సంకల్పంతోనే ప్రభుత్వ వైద్యశాలలను ఆధునీకరించామన్నారు. జగనన్న అధికారంలోకి వచ్చిన వెంటనే 108,104 సర్వీసులను పునరుద్ధరించారని గుర్తు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పరికి నజీమున్నీసా, వైస్ చైర్‌పర్సన్ గంగాదేవి, మున్సిపల్ కమిషనర్ కిరణ్‌కుమార్, కౌన్సిలర్లు కృపాకర్‌రెడ్డి, రాంప్రసాద్, రంగారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రణీత్‌రెడ్డి, జిలాన్, నౌషాద్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడికి ఎమ్మెల్యే పరామర్శ నల్లచెరువు: రాట్నాలపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత లక్ష్మీపతి రెడ్డికి ఇటీవల బైక్ ప్రమాదంలో చేయికి గాయమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి బుధవారం గ్రామంలోని ఆయన నివాసానికి వెళ్లి పరామర్శించారు. ఎంపీపీ రమణారెడ్డితో పాటూ స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతకు పరామర్శ


రాంభూపాల్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

బత్తలపల్లి: జ్వాలాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత, సచివాలయాల మండల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డిని బుధవారం ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి పరామర్శించారు. ఇటీవల బైక్‌పై నుంచి పడి కాలు విరిగింది. చికిత్స అనంతరం ఇంటి వద్ద విశ్రాంతి తీసుకుంటున్న ఆయనఆరోగ్య పరిస్థితిని ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ మాదిరెడ్డి జయరామిరెడ్డి, నాయకులు చల్లా క్రిష్టా, హనుమంతరెడ్డి, ప్రసాద్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ


మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ధర్మవరం అర్బన్: పట్టణంలోని సంజయ్‌నగర్‌కు చెందిన కత్తుల బుజ్జమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.10వేలు ఆర్థికసాయం అందించారు. వైఎస్సార్‌సీపీ పట్టణాధ్యక్షుడు ప్రకాష్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

షేర్ మార్కెట్‌పై విద్యార్థులకు అవగాహన


మాట్లాడుతున్న షేర్ మార్కెట్ నిపుణుడు రాజేంద్రప్రసాద్

ధర్మవరం అర్బన్: షేర్ మార్కెట్ పెట్టుబడిపై విద్యార్థులు అవగాహన కల్గి ఉండాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం విద్యార్థులకు షేర్ మార్కెట్ పెట్టుబడిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్‌తోపాటు వక్త రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ డిబెంచర్లు, మార్కెట్ బుల్ సెక్యూరిటీల్లో పెట్టుబడి పెట్టడం ద్వారా తక్కువ కాలంలోనే ఎక్కువ లాభాలు పొందడానికి అవకాశముంటుందన్నారు. విద్యార్థి దశ నుంచే షేర్ మార్కెట్‌పై అవగాహన ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ త్రివేణి, అధ్యాపకులు పుష్పావతి, కిరణ్‌కుమార్, షమీవుల్లా, చిట్టమ్మ, గోపాల్‌నాయక్, భువనేశ్వరి, సరస్వతి, ఆనంద్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

సిద్ధం సభకు సన్నద్ధం కావాలి


పార్టీ నాయకులు, కార్యకర్తలతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ నేత తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి

కనగానపల్లి: ఎన్నికల సమరశంఖారావంలో భాగంగా ఈ నెల 18న రాప్తాడు ఆటోనగర్‌లో నిర్వహించనున్న 'సిద్ధం' బహిరంగ సభకు మండలంలోని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సన్నద్ధం కావాలని వైఎస్సార్ సీపీ నాయకుడు తోపుదుర్తి రాజశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం ఆయన మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి సిద్ధం సభ విజయవంతానికి తీసుకోవాల్సిన చర్యలపై పార్టీ నాయకులు, కార్యకర్తలతో చర్చించారు. రాయలసీమ పరిధిలోని ప్రతి అసెంబ్లీ నియోజవర్గం నుంచి వైఎస్సార్ సీపీ శ్రేణులు తరలివస్తారన్నారు. మండలంలోని ప్రతి గ్రామం నుంచి వందల సంఖ్యలో ప్రజలు సిద్ధం సభకు తరలిరావాలన్నారు. రవాణా సౌకర్యం కోసం ప్రతి గ్రామం నుంచి బస్సులు, జీపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు మారుతి ప్రసాద్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అమరనాథరెడ్డి, నాయకులు నాగముని, సుధీర్‌రెడ్డి, డైరెక్టర్ ప్రభాకర్, యూత్ కన్వీనర్ అశోక్, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తిని మరింత అభివృద్ధి చేద్దాం


రత్నాకర్‌తో చర్చిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తి రూరల్: ప్రభుత్వం, సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ సమన్వయంతో పుట్టపర్తిని మరింత అభివృద్ధి చేద్దామని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్‌ను కోరారు. బుధవారం ప్రశాంతి నిలయంలో రత్నాకర్‌ను ఆయన ఛాంబర్‌లో ఎమ్మెల్యే కలిసి కాసేపు చర్చించారు. శ్రీ సత్యసాయి జిల్లా ఏర్పాటు, పుట్టపర్తి నియోజకవర్గంలోని 193 చెరువులు కృష్ణా జలాలతో నింపే కార్యక్రమం, నియోజకవర్గం మీదుగా జరుగుతున్న జాతీయ రహదారుల పనులపై రత్నాకర్ ఎమ్మెల్యేను ఆరా తీశారు. సత్యసాయిబాబా నడిచిన ఈ ప్రాంత అభివృద్ధికి సీఎం జగన్ ప్రభుత్వం తరపున ఎంతగానో తోడ్పాటునందిస్తున్నారని ఎమ్మెల్యే తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకందించే రాగి జావ కోసం సుమారు రూ.50 కోట్లు సహకారం అందించడం పట్ల ఎమ్మెల్యే రత్నాకర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం అయ్యేందుకు భగవాన్ సత్యసాయి బాబా ఆశీస్సులు ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు. 2026లో బాబా శత జయంత్యుత్సవాలు జగన్ ప్రభుత్వ సారథ్యంలో ఘనంగా జరుపుకోవాలన్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. పుట్టపర్తి అభివృద్ధికి సత్యసాయి ట్రస్ట్ అన్ని విధాలా సహకరిస్తుందని రత్నాకర్ తెలిపారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై రహస్యంగా కాసేపు ముచ్చటించినట్లు సమాచారం.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత


ఆశ్రమ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న డీసీఎంఎస్ చైర్మన్ చంద్రశేఖర్‌రెడ్డి

తాడిమర్రి: ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత లభిస్తుందని డీసీఎంఎస్ చైర్మన్ తాడిమర్రి చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక తూర్పు చెరువు వద్ద చౌడేశ్వరిదేవి ఆలయం సమీపంలో నిర్మించ తలపెట్టిన శ్రీకుండలిని సిద్ధ మహా యోగిని రమ్యాదేవి శక్తిపాత్ ఆధ్యాత్మిక ఆశ్రమం నిర్మాణానికి బుధవారం ఆయన భూమిపూజ చేశారు. అంతకు ముందు శివాలయంలో శివలింగం, దక్షిణామూర్తి, మహాగణపతి, సుబ్రహ్మణ్య స్వామి విగ్రహాలకు ప్రాణ ప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా మామిళ్లపల్లి సంతోష్‌శర్మ వేద పండితుల బృందం అగ్ని హోమం నిర్వహించి, మహావిష్ణు స్తోత్రం, మహాగణపతి పూజ తదితర పూజలు చేశారు. మంగళగిరి సిద్ధ వైద్యులు వెంకటనర్సయ్య, గోవర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం


చిన్నారికి అక్షరాభ్యాసం చేయిస్తున్న అంగన్‌వాడీ టీచర్ శోభ

ఎన్‌పీ కుంట: మండల కేంద్రంలోని 1వ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం చిన్నారులకు సూపర్‌వైజర్ నరసమ్మ ఆధ్వర్యంలో సామూహిక అక్షరాభ్యాసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వసంతపంచమిని పురస్కరించుకొని కార్యక్రమం చేపట్టామన్నారు. చిన్నారుల తల్లులకు వేసవిలో పిల్లల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ శోభ, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

దిశ డీఎస్పీగా శ్రీనివాసరావు


ఎస్పీకి పుష్పగుచ్ఛం అందిస్తున్న డీఎస్పీ శ్రీనివాసరావు

పుట్టపర్తి టౌన్: స్థానిక దిశ కార్యాలయంలో డీఎస్పీగా శ్రీనివాసరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న డీఎస్పీ వరప్రసాద్ గుండెపోటుతో మృతి చెందిన విషయం తెలిసిందే. రాజమండ్రి డీఎస్పీగా పనిచేస్తున్న శ్రీనివాసరావు ప్రభుత్వం ఇక్కడికి నియమించింది. ఇదిలా ఉండగా జిల్లా ఎక్సైజ్ అసిస్టెంట్ సూపర్‌వైజర్‌గా సహదేవన్, గాండ్లపెంట ఎస్‌ఐగా కృష్ణవేణి, ఏఆర్ ఆర్‌ఎస్‌ఐగా ఇమ్రాన్‌ఖాన్ బాధ్యతలు స్వీకరించారు. వీరందరూ ఎస్పీ మాధవరెడ్డిని ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. అప్రమత్తంగా అంకిత భావంతో పనిచేసి ప్రజల మన్ననలు పొందాలని ఎస్పీ వారికి సూచించారు.

సంక్షిప్త సమాచారం

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలు

ధర్మవరం అర్బన్: కాలేజీ సర్కిల్ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు.. కేతిరెడ్డికాలనీకి చెందిన శ్రీనివాసమూర్తి పనిమీద బైక్‌పై పట్టణంలోకి బయలుదేరాడు. కాలేజీ సర్కిల్ వద్ద ఐచర్ వాహనం వెనుకవైపు నుంచి ఢీకొంది. తీవ్రంగా గాయపడిన అతడిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు. వన్‌టౌన్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

21న బీసీ జిల్లా మహాసభ

పుట్టపర్తి టౌన్: బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 21న పుట్టపర్తిలో జిల్లా మహాసభ నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం నాయకులు పేర్కొన్నారు. బుధవారం స్థానిక సాయి ఆరామంలో వారు విలేకరులతో మాట్లాడారు. సార్వత్రిక ఎన్నికల్లో బీసీలకు మద్దతు నిచ్చే పార్టీలకు అండగా నిలుస్తామన్నారు. బీసీలలో చైతన్యం తీసుకొచ్చేందుకు ఈనెల 21న పట్టణ సమీపంలో ఉన్న శిల్పారామంలో బీసీ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లా నలుమూలల నుంచి బీసీలు పెద్ద ఎత్తున హాజరై సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. నాయకులు నామాల శంకర్, సామకోటి ఆదినారాయణ, నాగభూషణ, జయచంద్ర, కేశన శంకర్‌రావ్, గోపీనాథ్, సోము, నాగరాజు, రమణ, తదితరులు పాల్గొన్నారు.

చలో సేవాఘడ్‌కు బస్సుల ఏర్పాటు


జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: సంత్ సేవాలాల్ మహరాజ్ 285 జయంత్యుత్సవాల కోసం గుత్తి మండలం సేవాఘడ్‌కు వెళ్లే గిరిజనుల కోసం వైఎస్సార్‌సీపీ కదిరి నియోజకవర్గ సమన్వయకర్త బీఎస్ మక్బూల్ అహ్మద్ ఆధ్వర్యంలో బస్సులు ఏర్పాటు చేశారు. బుధవారం బంజారా సంఘం నాయకులు, వైఎస్సార్‌సీపీ నాయకులు బస్సుకు జెండా ఊపి ప్రారంభించారు. మక్బూల్ అహ్మద్‌కు బంజారా సంఘం నాయకులు కృతజ్ఞతలు తెలిపారు.

ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా హమీద్ బాషా

రామగిరి: చెన్నేకొత్తపల్లి తహసీల్దార్ ఎస్‌కె హమీద్‌బాషా బుధవారం రామగిరి ఇన్‌చార్జ్ తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టారు. తహసీల్దార్‌కు ఎంపీపీ మీనుగ నాగరాజు, జెడ్పీటీసీ నాగార్జున, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కర్రా హనుమంతరెడ్డితో పాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు.

తండ్రిపై కొడుకు కత్తితో దాడి

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని బేరిపల్లిలో తండ్రిపై కుమారుడు దాడి చేశాడు. వివరాలు.. గ్రామానికి చెదిన నజీర్‌బాషా, అతడి కుమారుడు ఇర్ఫాన్ బేల్దారి పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు. బుధవారం రాత్రి ఇద్దరూ మద్యం సేవించి గొడవపడ్డారు. ఈక్రమంలో ఇర్ఫాన్ కత్తితో తండ్రి తలపై దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో కుటుంబ సభ్యులు అతడిని కదిరి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచనల మేరకు అనంతపురం తీసుకెళ్లారు. నిందితుడి అరెస్టు చేసిన పోలీసులు అతడిపై కేసు నమోదు చేశారు.

నేడు ఎమ్మెల్యే ప్రచారం..

నల్లమాడ: మండలంలోని పోలంవాండ్లపల్లి, సీ. బడవాండ్లపల్లి, రెడ్డివారిపల్లి గ్రామాల్లో ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, సతీమణి దుద్దుకుంట అపర్ణారెడ్డి గురువారం ఉదయం 8 గంటలకు ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని ఎమ్మెల్యే కార్యాలయ వర్గాలు తెలిపాయి. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చాయి.